ఈనాడు
epaper.eenadu.net

# మెట్రో డీపీఆర్‌కి మూడు అధ్యయనాలు

ఈనాడు, హైదరాబాద్: జేబీఎస్ నుంచి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుంచి శామీర్‌పేట (21 కి.మీ.) మెట్రో కారిడార్ల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)ల తయారీకి అవసరమైన సర్వే పనులు వేగంగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఆర్ కోసం ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) కీలకమైనవని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి మొదటి రెండు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల సంస్థ కొన్ని భూసామర్థ్య అధ్యయనాలు చేపట్టడంతో మిగిలిన ప్రాంతాల్లో హెచ్ఏఎంఎల్ చేస్తుందని తెలిపారు. జేబీఎస్-మేడ్చల్ మార్గంలో 25 చోట్లకు 14, జేబీఎస్-శామీర్‌పేట మార్గంలో 19కి 11 చోట్ల పరీక్షలు నిర్వహించామని వివరించారు.



మేడ్చల్ మార్గంలో భూ సామర్థ్య పరీక్షలు

**1** ట్రాఫిక్ సర్వే: ప్రతిపాదిత మెట్రో కారిడార్లలో ప్రస్తుత రోజువారీ ప్రయాణాల అంచనాలు, కూడళ్లు, మలుపులు, పాదచారుల సంఖ్య, ప్రయాణికులకు పట్టే సమయం, ఇందులోంచి మెట్రోకి ఎంత మంది మారే అవకాశం ఉంది? మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల్లో ప్రయాణ సాంద్రత వంటి అంశాలను ఈ సర్వేలో పరిశీలిస్తారు.

**2** భూ సామర్థ్యం పరీక్ష: మెట్రో చేపట్టే మార్గాల్లో వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, నిర్మాణాలకు భూ సామర్థ్య పరీక్షలు, భూగర్భంలో నిక్షిప్తమైన నీటిమట్టం అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలను అధ్యయనం చేస్తారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత దృఢంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తారు. ప్రతి అరకిలోమీటర్‌కు ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు తీసుకుంటారు. ఏ స్థాయిలో భూమి గట్టితనం, రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని మెట్రో ఎండీ తెలిపారు.

**3** పర్యావరణ ప్రభావ అధ్యయనం: ప్రాజెక్టు ప్రతిపాదిత మార్గాల్లో ప్రస్తుతం గాలి నాణ్యత, ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, జీవ వైవిధ్యం, జీవనధార భృతులపై పడే ప్రభావాన్ని మదింపు చేస్తారు. ఈ రెండు కారిడార్లతో పాటు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ మార్గంతో సహా మార్చి నెలాఖరు డీపీఆర్‌లను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి సమర్పిస్తామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. తర్వాత కేంద్రానికి సమర్పిస్తామని వెల్లడించారు.

Date : 17/02/2025 EditionName : GREATER HYDERABAD PageNo :